
www.suryaa.com
19వ వసంతంలోకి ...
సూర్య ఎన్టీఆర్ కృష్ణా
బుధవారం 18 ఫిబ్రవరి 2026 పేజీలు 8



# సర్వేలతో సతమతమవుతున్న
# సచివాలయ సిబ్బంది



- అసలే సిబ్బంది కొరత...ఆపై పనిఒత్తిడి...
- గుండెపోటుతో కొందరు... ఆనారోగ్యంతో మరికొందరు మృతి
- ఎరక్కపోయి ఈ ఉద్యోగంలోకి వచ్చామని ఉద్యోగుల వేదన
- మూడు సచివాలయాలకు ఒకే ఒక్క వీఆర్వో
- ఉన్న అరకొర సిబ్బందిలో డిప్యుటేషన్‌పై మరికొందరు ఇతర శాఖల్లోకి...

**విజయవాడ కార్పొరేషన్, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే సర్వేలంటూ పెట్టి ప్రజలను నట్టేట ముంచిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల వుతోంది. ఇప్పుడు 'యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే' అంటూ ఒకటి పెట్టి ఆ బాధ్యతలు ఆయా సచివాలయాల సిబ్బందికి ప్రభుత్వం అప్పగించింది. ఈ నేపథ్యంలో ఇంటింటికి తిరిగి సర్వే వివరాలు అడుగుతుంటే వివరాలు చెప్పకుండా సిబ్బందిని అసహ్యించుకొంటూ మీ సర్వేలకో దండం అంటూ ప్రజల నుంచి నిరసన గళం వినిపిస్తోంది. ఎందుకంటే గత ప్రభుత్వ హయాంలో సర్వేల పేరిట సర్వేలు చేసి ఆ తర్వాత ప్రజల మీద ఎలాంటి బాదుడు పన్నులు వేసారో ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. అందుకే సర్వేల కోసం వెళ్లిన సచివాలయ సిబ్బందికి ప్రజల నుంచి మిగతా 2లో...

## వంద రోజుల ప్రణాళిక అమలుతో...
# నూరుశాతం ఉతీర్ణత సాధించాలి



- ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొనేలా విద్యార్థులను సన్నద్ధం చేయండి..
- పది ఉత్తీర్ణతలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం..
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** పదో తరగతి పరీక్షలకు సంబంధించి వంద రోజుల ప్రణాళిక అమలుతో నూరు శాతం ఫలితాలను సాధించి ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేయాలని, ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొని ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి పరీక్షల సమయం ఆసన్నమవుతున్న తరుణంలో విద్యార్థుల విద్యా బోధనను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం స్థానిక సూర్యారావుపేటలోని కర్నాటి రామమోహనరావు నగర పాలక సంస్థ పాఠశాలను, పటమటలోని గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు నగర పాలక ఉన్నత పాఠశాలను సందర్శించారు. మిగతా 2లో...



# పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షల నిర్వహణ
- 148 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతాయి
- కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన విద్య, వైద్య, ఏపీఎస్ఆర్టీసీ, పోలీసు, పోస్టల్, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, రవాణా తదితర శాఖల అధికారులతో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు, అదేవిధంగా ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. మిగతా 7లో

## త్వరలో ప్రధాని చేతుల మీదగా
# రాయనపాడు రైల్వే స్టేషన్ ప్రారంభం



రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, పురోగాభివృద్ధిపై డి.ఆర్.ఎంతో ఎంపీ కేశినేని శివనాథ్ సమావేశం 2లో..

## డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే
# 1972



7లో

(మొదటిపేజీ తరువాయి)

## సర్వేలతో సతమతమవుతున్న సచివాలయ సిబ్బంది

చీత్కారాలు ఎదురవుతూ వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. దీనికి తోడు 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందాన' అసలే సిబ్బంది కొరతతో, పనిఒత్తిడితో అల్లాడిపోతున్న సచివాలయ సిబ్బందికి ఈ సర్వే మరింత పనిభారం పెంచినట్టైంది. నగరంలోని ప్రతి సచివాలయంలోనూ 10 మంది వివిధ శాఖలకు చెందిన సెక్రటరీలు వుంటారు. కానీ ఒక్కొక్క సచివాలయం లో 6 నుంచి 7గురు మాత్రమే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇకపోతే మూడు సచివాలయాలకు ఒకే ఒక్క వీఆర్ విధులు నిర్వహించాల్సి రావడం, వారిపైన కూడా ఈ సర్వేల భారం పడటంతో వారు లోలోనే బాధను దిగమింగుకొంటూ ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయ సిబ్బంది 'అసలు పని' వదిలేసి కొసరు పనికోసం వెంపర్లాడుతున్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పూర్తవ్వగానే జనాభా లెక్కల సర్వే ప్రారంభం కానుంది. వీటికి తోడు ప్రస్తుతం 'అప్డేట్ ఈకేవైసీ', 'బయోమెట్రిక్ అప్డేట్', 'పి4 (బంగారు కుటుంబాలు) సర్వే', 'వాట్సాప్ డోర్' టు డోర్ క్యాంపెయిన్' సర్వేలు సచివాలయ సిబ్బంది చేస్తూనే వున్నారు. సచివాలయంలో వున్న ఆరేడుగురిలో పీజీఆర్ఎస్, సీఆర్డీఏ, హౌసింగ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లకు డిప్యుటేషన్ పై కొందరు సిబ్బందిని పంపేయడంతో వున్న అరకొర సిబ్బందిపై పనిభారం పెరిగి, మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మరణిస్తుంటే, మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారు. తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ లక్ష్మీశ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడైనా సచివాలయ సిబ్బందిని పెంచే యోచన చేయడంతో పాటు వారిపై పనిభారం తగ్గించే విధంగా చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

### వ్యాపారవేత్త వురిమి ప్రభాకరరావు కన్నుమూత



**చల్లపల్లి, మేజర్ న్యూస్:** ప్రముఖ వ్యాపారవేత్త, దివి తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వురిమి నాగ వెంకట ప్రభాకరరావు(66) గుండెపోటుతో మృతిచెందారు. హైదరాబాద్ లోని సోమవారం రాత్రి ఫోన్ మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ కావటంతో కన్నుమూ శారు. ప్రభాకరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భౌతికకాయాన్ని స్వగ్రా మమైన చల్లపల్లికి మంగళవారం రాత్రి తీసుకువచ్చారు. రైస్ మిల్లర్స్ అసోసి యేషన్కు సుదీర్ఘకాలం అధ్యక్షునిగా పనిచేసిన ప్రభాకరరావు, అవతార్ మెహెర్ బాబా సెంటరు ఉపాధ్యక్షులుగా ఉన్నారు. ప్రభాకరరావు ఆకస్మిక మరణం పట్ల వివిధ వర్గాల ప్రముకులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# వంద రోజుల ప్రణాళిక అమలుతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించిన సమయంలో పదవ తరగతి విద్యార్థులకు రోజువారి స్లిప్ టెస్టును నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష ముగిశాక జిల్లా కలెక్టర్ విద్యార్థుల మేధా శక్తిని పరిశీలిస్తూ గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ కు సంబంధించి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాదానాలను రాబట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల నుండి 11,200, ప్రైవేటు పాఠశాలల నుండి 16,000 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాసేందుకు సన్నద్ధం అవుతున్నారన్నారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరేందుకు లోతైన ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే ఆశించిన ఫలితాలు పొందగలుగుతారన్నారు. ఇష్టపడి నేర్చుకున్న విషయ పరిజ్ఞానం ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారని అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని కష్టమైనా ఇష్టపడి చదివితే సబ్జెక్టు అంశాలు గుర్తుంటాయన్నారు. తమ పిల్లలు తమలా కష్టపడకుండా ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సమాజంలో మంచి పేరు తెచ్చుకుని స్థిరపడాలనే ఆశతో ఎంతోమంది తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని రెట్టింపు చేసేలా ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదవ తరగతి పరీక్షలేనని ఈ పరీక్ష పాస్ అయితే ఉన్నత చదువులు చదివేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలన్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు అయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి వారికి అర్థమయ్యే రీతిలో బోధించి ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే పద్ధతి, ప్రశ్నకు సంబంధించి జవాబు వ్రాసే విధానం వంటి విషయాలను విద్యార్థులకు సూచించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న కీలక సమయంలో ఉపాధ్యాయులు సెలవులు వినియోగించవద్దన్నారు. విద్యార్థులకు వచ్చిన ఫలితాలు ఉపాధ్యాయులపై తల్లిదండ్రులలో గౌరవం పెంపొందేందుకు దోహదపడతాయన్నారు. 10వ తరగతి ఫలితాలలో జిల్లాను అగ్రగామిగ నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల సందర్శనలో జిల్లా కలెక్టర్ వెంట డిఇవో ఎల్. చంద్రకళ, కర్నాటి రామమోహనరావు నగర పాలక సంస్థ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సూర్యప్రభ, గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు ప్రధానోపాధ్యాయులు మురాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రత మనందరి బాధ్యత




**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన మొవ్వ వి.ఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో "రోడ్డు భద్రత మనందరి బాధ్యత' నినాదంతో కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవిఅధ్యక్షతన మంగళవారం సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా కూచిపూడి సబ్ ఇన్స్పెక్టర్ సిహెచ్.సురేష్ పాల్గొని మాట్లాడుతూ ఎక్కడ చూసినా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించవలసిన బాధ్యతతో పాటు అవగాహన కల్పించవలసిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉశీదనన్నారు. రోడ్డుపైన డ్రైవింగ్ చేస్తున్న లేదా నడిచి వెళుతున్న మనము అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వాహనాలు నడిపేవారు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రవాణా శాఖ,పోలీస్ శాఖల యొక్క సూచనలకనుగుణశీగా నడుచుకోవాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.ఆర్ మంజుల, కళాశాల స్టాఫ్ సెక్రటరీ, లైబ్రేరియన్ డాక్టర్ టి. శ్రీకాంత్,కెప్టెన్ ఆర్.వెంకయ్య పలువురు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

# త్వరలో ప్రధాని చేతుల మీదగా రాయనపాడు రైల్వే స్టేషన్ ప్రారంభం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** అమృత భారత స్టేషన్ పథకం కింద ఆధునీకరణ పనులు పూర్తి చేసుకున్న రాయనపాడు రైల్వే స్టేషన్ త్వరలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదు ప్రారంభం అవుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. కొండప్లలి రైల్వే స్టేషన్‌లో రెండు ప్లాట్ పామ్స్ విస్తరణ తో పాటు, మౌలిక సదుపాయలు,ఆధునీకరణ పనుల నిమిత్తమై సూమారు రూ.10 కోట్లు నిధులు మంజూరు కాగా, పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు.ఇక కొండపల్లి రైల్వే స్టేషన్ ను అమృత్ భారత్ కింద అప్గ్రె చేసి సెకండ్ ఫేస్ ఆఫ్ అమృత్ భారత్ 2.0 కింద కూడా దీన్ని తీసుకురాబోతున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, పురోగాభివృద్ధి కి సంబంధించి డి.ఆర్.ఎమ్ కార్యాలయంలో మంగళవారం డి.ఆర్.ఎం మోహిత్ సోనాకియా తో పాటు ఇతర రైల్వే అధికారులతో ఎంపీ కేశినేని శివనాథ్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్, డి.ఆర్.ఎమ్ మోహిత్ సోనాకియా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో రైల్వే శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చక్కటి అవకాశాలు కల్పించిందని తెలిపారు. అత్యధిక వేగంతో నడిచే బుల్లెట్ ట్రైన్స్, ఫాస్ట్ ట్రైన్స్ ప్రాజెక్టులు పుణెహైదరాబాద్, హైదరాబాద్చెన్నై, హైదరాబాద్బెంగళూరు, బెంగళూరుచెన్నై మార్గాల్లో ప్రతిపాదించబడటం ద్వారాదక్షిణ భారత రవాణా వ్యవస్థకు పూర్తిగా కొత్త దిశ ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ లో రైల్వే శాఖకి సంబంధించి రాష్ట్రానికి కీలక ప్రాజెక్టులు సాధ్యపడటానికి ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఎంతో వుందన్నారు. ఢిల్లీలో సీఎం చంద్రబాబు 15 సార్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కలిసి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రైల్వే జోన్, అమరావతి రైల్వే స్టేషన్, కొత్త రైల్వే లైన్లపై నిరంతరం వినతులు చేయడం వల్లే ఈ బడ్జెట్‌లో ఇన్ని అవకాశాలు వచ్చాయని తెలిపారు. ఈసందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డీఆర్ఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నగరంలో ఉన్న రైల్వే సంబంధిత సమస్యలపై విస్తృతంగా చర్చించటంతో పాటు, ముఖ్యంగా రాబోయే ఆర్ఓబీలు, ఆర్‌యూబీలు, విజయవాడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ, రైల్వే లైన్ కింద వున్న డ్రైనేజ్ సమస్యల పరిష్కారం పై రైల్వే అధికారులకు తగు సలహాలు సచనలు అందించటం జరిగిందన్నారు. మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలోని ఈలప్రోలు గ్రామం గుంటుపల్లి వ్యాగన్ వర్క్ షాప్ దగ్గర ఎల్.సి నెంబర్ 147 వద్ద ఆర్.వో.బికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని, త్వరలో శంకుస్థాపన జరుగుతుందన్నారు. వీటికి తోడు కొండపల్లి ఎస్టీ కాలనీలో ఉన్న ఎల్.సి నెంబర్ 140 ఆర్.యు.బి కూడా క్లియర్ అవ్వడం జరిగిందని వివరించారు. విజయవాడ రూరల్ మండలంలోని రాయనపాడు లోని ఎల్.సి నెంబర్ 148 వద్ద ఆర్.వో.బి టెండర్ దశలో వుందని వివరించారు. ఇక ఎల్.సి నెంబర్ 316 : గుణదల బి క్యాబిన్ వద్ద గల వైజాగ్ – చెన్నై రైల్వే లైన్ పై ఆర్.వో.బి టెండర్ దశ పూర్తి అయిందని, ఎల్.సి నెంబర్ 8 : గుణదల వద్ద విజయవాడ –గుడివాడ రైల్వే లైన్ పై నిర్మించతలపెట్టిన ఆర్.వో.బి కి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తి అయిందని టెండర్ ప్రక్రియ మొదలు కావాల్సి వుందని తెలిపారు. అలాగే ఎల్.సి నెంబర్ 1ఇ: న్యూ రాజరాజేశ్వరి పేట టూ ఓల్డ్ రాజరాజేశ్వరి పేట మధ్య ఆర్.యు.బి నిర్మాణ ప్రదేశం పరిశీలించి భూసేకరణ పనులు, అంచనాలు, డిజైన్స్ ఫైనల్ చేయటం జరిగిందన్నారు. త్వరలోనే టెండర్ కు వెళ్లనున్నట్లు తెలిపారు. అదే విధంగా వాంబే కాలనీ వాసుల కల నెరవేరబోతుందన్నారు. వాంబే కాలనీ – మధురనగర్ మధ్య గల కలకత్తా – చెన్నై రైల్వే లైన్ వద్ద ఆర్.యు.బి నిర్మాణముకు సంబంధించి విజయవాడ నగర పాలక సంస్థకు ఉత్తరం రాయడం జరిగిందని,. అక్కడ పొజిషనింగ్ ఆఫ్ డ్రైనేజ్ మార్చుమని కోరగా, ఆ డ్రైనేజ్ ను మార్చుడానికి నగర పాలక సంస్థ కూడా సిద్ధంగా ఉందని తెలిపారు. వీటికి తోడు ఎల్.సి నెంబర్ 6ఏ & 6 బి : రైల్వే యార్డ్ వద్ద గల శిథిలావస్థకు చేరిన కె.ఎల్.రావు బ్రిడ్జ్ ( ఎర్రకట్ట ) తొలగించి నూతనంగా నిర్మించనున్న ఆర్.యు.బి నిర్మాణంకు సంబంధించి దాని ఫీజిబిలిటీ స్టడీ కింద బెంగుళూరుకు చెందిన సంస్థ డిపిఆర్ రెడీ చేస్తోందని, త్వరలోనే రిపోర్ట్ రాబోతుందన్నారు. ఇక ఎల్.సి నెంబర్ 150: గొల్లపూడి వై జంక్షన్ నుంచి జక్కంపూడి వెళ్లే దారిలో విజయవాడ –న్యూ ఢిల్లీ రైల్వే లైన్ పై నిర్మించతలపెట్టిన ఆర్.వో.బి టెండర్ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన విజయవాడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ అంశం పార్లమెంట్ లో తాము ప్రస్తావించగానే రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తక్షణం ప్రాసెస్ చేశారన్నారు. నీతి ఆయోగ్ నుంచి కూడా పాస్ అయిందన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ అభివృద్ధి కోసం



రూ.834 కోట్లు కేటాయించటం జరిగిందన్నారు. దీనికి సంబంధించి దానికి ప్రీ బిడ్ మీటింగ్స్ కూడా జరిగినాయి. ప్రీ బిడ్ టెండర్ మార్చి 31 కల్లా క్లోజ్ చేస్తారని తెలిపారు. దేశంలోనే బిజీయెస్ట్ అండ్ బిగ్గెస్ట్ రైల్వే స్టేషన్ అయిన విజయవాడ రైల్వే స్టేషన్ ను మొట్టమొదటిసారిగా ఇండియాలోనే పిపిపి మోడలో విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయబోతున్నట్లు తెలిపారు. త్వరలోనే విజయవాడ –బెంగళూరు వందే భారత్ స్లీపర్ కోచ్ కూడా రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. విజయవాడ నగర అభివృద్దిలో రైల్వే శాఖ ఎంతో కీలకమన్నారు. ఎందుకంటే నగరం మొత్తం రైల్వే ట్రాక్స్ వుండటం వల్ల ట్రాఫిక్, డ్రైనేజీలు కూడా రైల్వే వ్యవస్థతో ముడిపడి వున్నాయన్నారు. గత సంవత్సరం కాలం నుంచి తాను ఈ సమస్యల పరిష్కారం కోసం డి.ఆర్.ఎమ్, జీఎం, రైల్వే బోర్డు మెంబర్స్, రైల్వే బోర్డు చైర్మన్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి ని కలిసి ఎప్పటికప్పుడు పార్లమెంట్లో ప్రస్తావిస్తున్న విషయాలన్నీ కూడా ఒక రెండు మూడు నెలల్లో పరిష్కారం కానున్నాయన్నారు. జర్నలిస్ట్ రైల్వే పాసుల అంశం డి.ఆర్.ఎమ్ పరిధిలో లేదని, రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఒక ప్రశ్నకు సమాధానం గా బదులిచ్చారు. ఇక నగరంలోని రైల్వే కాలనీల్లో 50 సంవత్సరాల క్రితం కట్టిన క్వార్టర్స్ లో ఎవరు వుండలేని పరిస్థితి వుందని విజయవాడ రైల్వే స్టేషన్ తో పాటు, క్వార్టర్స్ ను కూడా అభివృద్ధి చేయడానికి టెండర్స్ పిలవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డి.ఈ.ఎన్ సూర్య ప్రకాష్, డి.ఈ.ఎన్ బెజవాడ ఉపాధ్యాయ, గతిశక్తి అధికారి రమణ, ఆర్.ఎల్.డి.ఎ అధికారి కె.శ్రీనివాసరావు, మైలవరం నియోజకవర్గ బిజెపి అధ్యక్షుడు నూతలపాటి బాలకోటేశ్వరరావు (బాల), టిడిపి సీనియర్ నాయకులు జి. గోపాలకృష్ణ, కొండపల్లి బిజెపి ప్రెసిడెంట్ తమ్మినేని మాధురి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి చిన్న తిరునాళ్ల సందర్భంగా పోలీస్ వారి హెచ్చరిక..



ఎస్ఐ అర్జున్

**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** 26-02-2026 తారీకు సాయంత్రం 5గంటల లోపు పసుపు కుంకుమ బండ్లు పోలీస్ స్టేషన్ నందు నమోదు చేయించుకోవలెనని స్థానిక ఎస్ఐ అర్జున్ తెలిపారు. వివరాలు నమోదు లేనిచో వారికి లైటింగ్ ట్రాక్టర్, మైకులను పసుపు కుంకుమ బండ్ల ఊరేగింపులో అనుమతించబ డవని ఆయన అన్నారు. గత సంవత్సరం గొడవలు జరిగిన రిత్యా డిజే లకు ఎలాంటి పర్మిషన్ ఇవ్వబడదని ఆయన హెచ్చరించారు. ఎస్సై అర్జున్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి చిన్న తిరుణాలలో భాగంగా పసుపు కుంకుమ బండ్లను 07-03-2026న ఊరేగింపుకు ఆలయ సిబ్బంది, కమిటీ నిర్ణయించడమైనది. ఆరోజు పసుపు కుంకుమ బండ్లు ఊరేగింపునకు ఉపయోగించే లైటింగ్ ట్రాక్టర్లు వివరములు, వాటికి సంబంధించిన మైకు అనుమతులు 26-02-2023 న సాయంత్రం 5 గంటల లోపు స్థానిక పోలీస్ స్టేషన్ కి వచ్చి సంబంధిత పత్రాలు సమర్పించగలరని ఆయన కోరారు. ఈ ఊరేగింపు బండికి సంబంధించిన కమిటీ సభ్యుల వివరాలు అనగా ఆధార్ కార్డు జిరాక్స్, ఊరేగింపు బండికి సంబంధించిన పత్రాలు తీసుకొని పోలీసు వారు నిర్ణయించిన తేదీ లోపు స్టేషన్లో ఇవ్వవలసిందిగా ఎస్ఐ అర్జున్ తెలిపారు. ముందుగా అనుమతి తీసుకొని మైకుల యాజమాన్యంపై కేసు నమోదు చేయబడుతుందని ఆయన హెచ్చరించారు . గత సంవత్సరం గొడవలు జరిగిన రిత్యా డిజే లకు ఎలాంటి అనుమాతులు ఇవ్వబడని ఆయన అన్నారు. పోలీసు వారు నిర్ణయించిన సమయం మించిన తర్వాత వచ్చిన ప్రతి ఒక్క బండి కూడా ఈ పసుపు కుంకుమ బండ్లు ఊరేగింపులో తీసుకోబడవని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అర్జున్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

### పోక్సో కేసు నమోదు... నిందితుడు అరెస్ట్

**పామర్రు మేజర్ న్యూస్ :** నాలుగు సంవత్సరాల చిన్నారిపై లైంగిక దాడి జరిగిన సంఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు గుడివాడ డిఎస్పి వి.ధీరజ్ వినీల్ తెలిపారు. పామర్రు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పెదపారుపూడి మండలంలో కుటుంబ కలహాల నేపథ్యంలో బాలిక తల్లి పిల్లలను అత్తవారింట్లో వదిలి ఈనెల 5వ తేదీన పుట్టింటికి వెళ్లిందన్నారు. ఆ పాప నాయనమ్మ చిన్నారికి స్నానం చేయించమని 7వ తేదీన కోరగా సమీప బంధువు స్నానం చేయించి అనంతరం గదిలోనికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం అత్తవారింటికి వచ్చిన పాపతల్లి తిరిగి వచ్చాక పాప అనారోగ్యంతో ఉంటం గమనించి గుడివాడ ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా లైంగికదాడి జరిగినట్లు నిర్ధారణ అయింది. దీంతో బాలిక తల్లి ఈనెల 14వ తేదీన పెదపారుపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు నిందితునిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.శుభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి గుడివాడ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డి.ఎస్.పి వివరించారు. ఈ సమావేశంలో సిఐ శుభాకర్, పెదపారుపూడి ఎస్సై ఆర్.శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరునికి వెండి మారేడు దళాల గొలుసు



**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పెదపూడి గ్రామానికి చెందిన తాడికొండ రంగనాయకమ్మ కుమారుడు తాడికొండ అవినాష్, అనురాధ దంపతులు తమ కుమారుడు మోక్షిత్ శ్రీకర్ జ్ఞాపకార్థం 50 వేలపైగా విలువగల 150 గ్రాముల వెండితో తయారు చేయించిన మారేడు దళాల గొలుసు దేవాలయ పాలకమండలి ఉపాధ్యక్షుడు పసుమర్తి నారాయణమూర్తి, ఆలయ అర్చకులు పెనుమూడి. సతీష్ కుమార్లకు అందజేశారు.

## ఎమ్మెల్యే సహకారంతో హాస్టల్ అభివృద్ధి

### రూ.33.40లక్షలతో మోపిదేవి ఎస్సీ బాలికల వసతి గృహం అభివృద్ధి పూర్తి



**మోపిదేవి మేజర్ న్యూస్ :** మోపిదేవిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల ప్రత్యేక వసతి గృహాన్ని రూ.33.40 లక్షలతో అభివృద్ధి చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులు రూ.33.40 లక్షలతో ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థినుల కోసం నూతన డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి చేశారు. హాస్టల్ భవనం మరమ్మత్తులు చేసి పెయింటింగ్ వేయించారు. మరుగుదొడ్ల మరమ్మత్తులు, పెయింటింగ్ పూర్తి చేసి రన్నింగ్ వాటర్ సదుపాయం పునరుద్దరించారు. గదుల కిటికీలకు దోమలు రాకుండా మెస్ ఏర్పాటు చేశారు. తలుపులు, కిటికీలు బాగు చేయించారు. హాస్టల్లో విద్యుత్ మరమ్మత్తులు పూర్తి చేశారు. వంట గదికి టైల్స్ వేయించారు. ప్రాంగణంలో పాత్-వే నిర్మించారు. నూతన డ్రైనేజీ పైపులు ఏర్పాటు చేశారు. తద్వారా విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ పనులను ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈఈ రాజేష్ పర్యవేక్షించారు. తమ వసతి గృహ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదుకు వసతి గృహ సంక్షేమ అధికారిణి యాసం శివ నాగలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.






## సి.ఎస్.టి.ఇలో పెదపూడి పాఠశాలకు గుర్తింపు

**మొవ్వ మేజర్ న్యూస్ :** ఉయ్యూరు జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించిన సి.ఎస్.టి.ఇ (కంప్యూటర్ సైన్స్ టీచింగ్ ఎక్సెన్స్) కార్యక్రమంలో పాల్గొన్న పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వాటర్ బాటిల్స్, జ్ఞాపికలతో పాటు పాఠశాలకు లాప్టాప్ అందజేశారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. కరుణాకర రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందింప చేసుకోవడం కోసం అమెజాన్ సంస్థ, సమగ్రశిక్ష అభియాన్ సంస్థ జిల్లాస్థాయిలో ఈనెల 16వ తేదీన నిర్వహించిన ఏ.పీ.సి.ఎస్ టి.ఇ జిల్లా ప్రతిభా పోటీలలో తమ పాఠశాల ఐదవ తరగతి విద్యార్థులు పేరం వీరేంద్రబాబు,దేశి.తనోజ్ కుమార్, రిషికేష్ నాయుడు బోయ,గైడ్ టీచర్ ఎస్.వి ఝాన్సీ లక్ష్మి సారథ్యంలో పాల్గొన్నారని తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ విద్యార్థుల కుటుంబంతో పాటు మండల విద్యాశాఖ అధికారులుఏ. భాను ప్రకాష్, కే.శ్రీలక్ష్మి లు, సీఆర్పీలు తాతా. సమర్పణరావు, కంచర్లఆంజనేయులు అభినందించారు.

## నేటి నుంచీ శ్రీసంపటాలమ్మ తల్లి వార్షికోత్సవాలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి గ్రామదేవత, చల్లనితల్లి శ్రీసంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ 27వ వార్షికోత్సవాలు ఈనెల 18వ తేదీ బుధవారం నుంచీ మూడు రోజులపాటు జరుగనున్నాయి. ఉదయం గం.10.25 లకు శతభిషా నక్షత్ర యుక్త మేషలగ్న పుష్కరాంశమందు విఘ్నేశ్వర పూజ, గోపూజ, శ్రీఅమ్మవారికి అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 19వ తేదీ సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం అమ్మవారికి కుంకుమపూజ, 20వ తేదీ కుంకుమ పూజ, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తిచేశారు.



## రీ సర్వేను పరిశీలించిన కలెక్టర్

**చల్లపల్లి,మేజర్ న్యూస్ :** ప్రణాళికాబద్ధంగా రీ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చల్లపల్లి మండలం మాజేరు శివారు పచ్చావారిలంక గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను మంగళవారం ఉదయం కలెక్టర్ పరిశీలించారు. ఈ సం దర్భంగా సర్వేయర్లతో మాట్లాడి సర్వే జరుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మ ఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట సర్వే ఏడి లక్ష్మణ్, చల్లపల్లి ఇన్చార్జి తహసీల్దార్ శ్రీలత, రీసర్వే డీటీ సిహెచ్. నీలిమ, సర్వేయర్ వల్లి, ఆన్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో పరిశ కిరణ్ కుమార్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



## నిరవధిక సమ్మెతో మూతపడ్డ సొసైటీలు

**మొవ్వ మేజర్ న్యూస్:** ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న వ్యవసాయ సహకార పరపతి సంఘం సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా నిర్వహిస్తున్న కార్యాచరణలో భాగంగా విధులు బహిష్కరించి ఈనెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్ళటంతో సొసైటీ కార్యాలయాలకు తాళాలుపడి మూతపడ్డాయి. దీంతో రెండు రోజులుగా కొనసాగుతున్న సిబ్బంది నిరవధిక సమ్మెతో సొసైటీల లావాదేవీలతో పాటు రుణాల దరఖాస్తులునిలిచిపోయాయి. మొవ్వ కో-ఆపరేటివ్ బ్యాంక్బ్రాంచ్ పరిధిలోని కాజ,కోసూరు, మొవ్వ పాలెం, మొవ్వ,కూచిపూడి, అయ్యంకి, చినముత్తేవి సొసైటీలు, గూడూరుకోపరేటివ్ బ్యాంకుబ్రాంచ్ పరిధిలోని అవురుపూడి,నిడుమోలు సొసైటీలు పని చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సహకార సంఘాల సిబ్బంది సమస్యలను సహకార సంఘాల సిబ్బందితో పాటు రైతులు కోరుతున్నారు.

## చెక్ పోస్ట్లలను తనిఖీ చేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్



**పెడన,మేజర్ న్యూస్ :** చెక్ పోస్టుల వద్ద రవాణా తనిఖీలు రికార్డుల నిర్వహణ ప్రజా సౌకర్యాలపై నిర్లక్ష్యం తగదని పెడన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ భీముని అనంత లక్ష్మి అన్నారు. ఈ మేరకు రామరాజు పాలెం చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ చెక్ పోస్టు వద్ద జరుగుతున్న రవాణా తనిఖీలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు సూచిస్తూ, పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు. అవసరమైన చోట సౌకర్యాల మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## బాపులపాడులో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** బాపులపాడు గ్రామంలో నేడు (బుధవారం) విద్యుత్ లైన్ల మరమ్మత్తుల పనుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. నూజివీడు రోడ్, గుడివాడ రోడ్, ఇందిరానగర్, బీసీ కాలనీ, కృష్ణానగర్, ఐటీఐ రోడ్, ఎంఆర్ఓ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఈ అంతరాయం కొనసాగనుంది. నిర్వహణ పనులు పూర్తయ్యిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అత్యవసర పనులు ఉన్న ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకో వాలని, విద్యుత్ శాఖ చేపడుతున్న మరమ్మత్తుల పనులకు సహకరించాలని కోరారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి. శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు.



## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ రమణ, డా. పి. మణి బాబు ఆధ్వర్యంలో మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ 400మి. గ్రాములు మాత్రలను విద్యార్థులకు నమిలి చప్పరించి మిగించినామని, నులిపురుగులు, కొంకిపురుగులు, బద్దెపురుగులు అయిన అంతర పరాన్నజీవులను నిర్మలించుటవలన పిల్లలలో రక్తహీనత నుంచి కాపాడవచ్చని, 1 నుంచి 19 సంవత్సరం వయస్సు వున్న పిల్లలు అందరికీ మింగించినామని అన్నారు. మండలం మొత్తం 7452 విద్యార్థిని, విద్యార్థులకు గాను,7303 పిల్లలకు మాత్రలు మ్రింగించామని,98శాతము పిల్లలు కు మింగడం జరిగినదని డాక్టర్ తెలిపారు. మిగిలిన పిల్లలు కు ఫిబ్రవరి 24 తారీకున మాప్అప్ రోజున మింగించుతామని అన్నారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, హ్యాండ్ వాష్ చేసుకోవాలని, ఆరోగ్య విద్య గురించి తెలియజేసారు.ఈ కార్యక్రమంలో, ఎంపీడీఓ రమణ, మండల విద్యాశాఖధికారి రమేష్ వై ద్యాధికారి డా.పి మణి బాబు, హై స్కూల్ హెడ్ మాస్టర్ ధర్మశీల, డాక్టర్. కీర్తి, ఉపాధ్యాయులు, సిహెచ్ఓ శ్యాంసుందరరావు, సూపర్వైసర్ రామ కుమార్, భవాని, ఎమ్ ఎల్ హెచ్పి జి రమణ, ఆరోగ్య కార్యకర్తలు జి నాగేశ్వరరావు, సౌజన్య, ఆశ కార్యకర్తలు,, మండలం లో అన్ని అంగన్వాడీ, ఎలిమెంటరీ, హై స్కూల్, కాలేజ్ లలో సూపెర్వైసర్, ఎమ్ ఎల్ హెచ్ పి /సి హెచ్ ఓ, ఆశా లు,హెల్త్ అసిస్టెంట్ అంగన్వాడీ టీచర్లు, పాఠశాల టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## నులి పురుగు నివారణ మందులు పంపిణీ



**ఎ.కొండూరు, మేజర్ న్యూస్ :** జాతీయ నులిపురుగుల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం నులిపురుగు నివారణ మాత్రలను (ఆల్బెండజోల్) పంపిణీ చేస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు వేముల స్వాతి, పి దివ్య తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నులిపురుగుల నివారణకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ పిల్లలు దగ్గర నుండి 19 సంవత్సరాల పిల్లల వరకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో, మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో 98 శాతం మంది పిల్లలకు వేసినట్లు తెలిపారు. అలానే కడుపులో నులిపురుగులు రాకుండా ఉండాలంటే ప్రతి రోజు ఆహారం తీసుకునే ముందు విద్యార్థులు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కడుపులో నులిపురుగులు చేరితే రక్తహీనత వచ్చే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, తాసిల్దార్ ఎం అరవింద్, డిప్యూటీ ఎంపీడీవో ఎడ్విన్ సుందర్ లాల్, ప్రిన్సిపాల్ విజయ సుందరి, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## 5494 మందికి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ



**మొవ్వ మేజర్ న్యూస్:** మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలో 1నుంచి19 సంవత్సరాల లోపు 5494 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నులు పురుగు నివారణ మందులు పంపిణీ చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.రాజేశ్వరి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన మొవ్వ పీఎం ఎస్ఎంకె జడ్పీ ఉన్నత పాఠశాలలో నులిపురుగు నివారణ మాత్రలను వైద్యాధికారి డాక్టర్ రాజేశ్వరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1నుంచి19 వయస్సు లోపు గల 5645 మందికి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ చేయాలని లక్ష్యం కాగా ఎప్పటికీ 5494 మందికి పంపిణీ చేయడం జరిగింద న్నారు. ఆయా పాఠశాలల్లో 151 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరు కాలేదని వారికి కూడా నులిపురుగు నివారణ మాత్రం పంపిణీ చేసి లక్ష్యాలను అధిగమిస్తామని డాక్టర్ రాజేశ్వరి తెలిపారు.

# నులి పురుగుల నివారణతో చిన్నారుల అనారోగ్యానికి అడ్డుకట్ట వేద్దాం..

### చిన్నారులు, కిశోర బాలలు అల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** చిన్నారులు, కిశోర బాలల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమైన నులి పురుగుల నివారించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అల్బెండజోల్ మాత్ర ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులకు పంపిణీ చేసిన అల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా వినియోగించేలా పూర్తి పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య, విద్యాశాఖల ఆధ్వర్యంలో స్థానిక సివిఆర్ హైస్కూల్లో నిర్వహించిన నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్ని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై నులి పురుగులు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. చిన్నారుల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీసే నులి పురుగులను నివారించేందుకు అల్బెండజోల్ మాత్ర సురక్షితమైన మార్గం అన్నారు. విద్యార్థుల విద్య మానసిక వికాసంపై ప్రతికూల ప్రభావం చూపే నులి పురుగులను కేవలం ఒకే అల్బెండజోల్ మాత్రతో నివారించ వచ్చునన్నారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించి అల్బెండజోల్ మాత్రను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అల్బెండజోల్ మాత్రను చిన్నారులు తప్పనిసరిగా వినియోగించడం ద్వారా పోషకాల లోపం, అలసట, బలహీనత వంటి సమస్యలను నివారించవచ్చున్నారు. ఒక ఏడాది నిండిన పిల్లల నుంచి 19 సం.ల వయస్సు కలిగిన ప్రతి చిన్నారి తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ చేసిన అల్బెండజోల్ మాత్రలు చిన్నారులు వినియోగించేలా ఉపాధ్యయులు బోదనేతర సిబ్బంది తల్లిదండ్రులు పూర్తి పర్యవేక్షణ చేయవలసి ఉందన్నారు. వివిధ కారణాల వల్ల మాత్ర తీసుకోని చిన్నారుల కొరకు ఈ నెల 24వ తేదీన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మాత్రలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దినచర్యలలో పరిశుభ్రమైన నీటిని తాగడం, ఎప్పటికప్పుడు చేతులను శుభ్రపరచుకోవడం వంటి ఆరోగ్య సూత్రాలను పాటించి నులిపురుగుల ఉత్పత్తిని నివారించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.ఎం సుహాసిని అల్బెండజోల్ మాత్రల ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరిస్తూ ఏడాదికి రెండుసార్లు పిల్లలు, కిశోర బాలలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్సీలు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యాసంస్థలలో నులి పురుగుల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ తదితర విద్యా సంస్థలలో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు తల్లిదండ్రులపై ఉందని డిఎం & హెచ్ ఓ సుహాసిని అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారిణీ ఎల్. చంద్రకళ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో 916 ప్రభుత్వ పాఠశాలలు 508 ప్రైవేటు పాఠశాలలు 29 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 94 ప్రైవేటు జూనియర్ కళాశాలలు 15 ప్రైవేట్ సాంకేతిక విద్యా సంస్థలు 32 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు 12 ఇంజనీరింగ్ కళాశాలలు 1475 అంగన్వాడీ కేంద్రాలు ఇతర విద్యా సంస్థలతో కలిపి 3,125 విద్యా సంస్థల ద్వారా 5 లక్షల 6 వేల 200 మంది చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చంద్రకళ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియార్ మెడికల్ ఆఫీసర్ ఎస్ ఎస్.ఎ.యు డా.ఎం.ఉషారాణి, జిల్లా విద్యా శాఖ అధికారిణి ఎల్. చంద్రకళ, సివిఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ ఐ. సుబ్రహ్మణ్యం, ఆర్బీఎస్కె ప్రోగ్రామ్ అధికారి డా. మాధవి, లబ్బీపేట యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డా. భార్గవి, ప్రోగ్రాం కన్సెల్టెంట్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి నుంచే ఆరోగ్య పథంలో పయనించాలి



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** విద్యార్థి దశ నుండే ఆరోగ్య సూత్రాలను పాటించటం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యపడుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పెనుగంచిప్రోలు జడ్పి హైస్కూల్లో విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి 1 - 19 సంవత్సరాల వయసున్న పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. చిన్నారుల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు కారణమైన నులి పురుగులను నివారించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అల్బెండజోల్ మాత్ర ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చిన్నారులు కూడా శుభ్రతకు సంబంధించి మంచి ఆలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. భోజనానికి ముందు, తరువాత, అడుకున్న తరువాత చేతులను బాగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. శరీరంలో నులిపురుగులు ఉండటం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్నారు.



### పమిడిముక్కలలో..

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా మంగళవారం పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డివర్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులతో మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె.అఖిల, ఎంపిడిఓ వీర్ల సీతారామరాజు, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సీ, సి.హెచ్.ఓ లక్ష్మి, ఎయన్ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ బుజ్జిబాబు, నరేంద్రబాబు, పాఠశాల ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రతతో నులిపురుగుల సమస్య దూరం





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వ్యక్తిగత పరిశుభ్రతతో నులిపురుగుల సమస్య దూరం అవుతుందని విజయవాడ నగరపాలక అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం కే బి సి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పటమట లో విద్యార్థినీ విద్యార్థులకు జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా వారికి నులిపురుగు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు నులిపురుగుల వల్ల శరీరానికి జరిగే నష్టాలు, శరీరంలోకి నులిపురుగులు రావటానికి ముఖ్య కారణం అపరిశుభ్రంగా ఉండటం అని, చేతిలో ఉన్న వేళ్ళకు గోళ్లు తీయకపోవడం, ఆహారం సేవించేటప్పుడు చేతులను పరిశుభ్రంగా కడుక్కోకపోవటం వలన నులిపురుగులు శరీరంలోకి వస్తాయని, అవి మన శరీరంలోకి ప్రవేశించిన తర్వాత మన శరీరానికి అన్ని విధాలుగా నష్టం కలిగిస్తాయని, రక్తహీనత, నీరసం, నిరుత్సాహం వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు అందరికీ అవగాహన కల్పించి వారి ఇంటి మొత్తంలో కూడా నులిపురుగుల మందు తీసుకోటానికి ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, కేబీసీ పాఠశాల హెడ్ మాస్టర్ వి. వి. ని సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిహారిక, ఎ ఎన్ ఎమ్ లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

# వర్సిటీ సర్వతో ముఖాభివృద్ధికి కృషి

## కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా విశ్వవిద్యాలయం సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య కె.రాంజీ స్పష్టం చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పదవి బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భముగా మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో జపాన్, స్వీడన్ దేశాల్లోని విదేశీ విశ్వవిద్యాలయాలతో పాటు దేశంలో భారత్ ఎలెక్ట్రానిక్స్, రాజ్య సైనిక్ బోర్డు లాంటి పలు ప్రతిష్టాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. పిఎం ఉషా పథకం కింద మంజూరైన 20 కోట్లు రూపాయలతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే విశ్వవిద్యాలయంలో క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ఖేల్ ఇండియా పథకం కింద 39 కోట్ల రూపాయల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వంకు పంపించడం జరిగింది అని చెప్పారు. విశ్వవిద్యాలయం లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించి బయటకు వెళ్లేలా క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించి గత ఏడాది నూరు శాతం ఉద్యోగాలు ఇప్పించడం జరిగింది అన్నారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిల చేతులమీదుగా నియామక పత్రాలు అందచేయడం జరిగిందని వివరించారు. ఈ ఏడాది కాలంలో స్నాతకోత్సవం, కృష్ణా తరంగ్ యూత్ ఫెస్టివల్ విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఇప్పుడు విజయవాడలో అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల నెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించబడుతోంది అని చెప్పారు. ఎన్ టి ఆర్ జిల్లా విద్యార్థుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విజయవాడలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి బాలికల వసతి గృహం, ఫార్మసీ కళాశాల భవనాలను ప్రారభిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఫుడ్ కోర్టును ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రెక్టర్ ఆచార్య ఎంవి. బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉషలు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## మహిళల గౌరవంపై ద్వంద్వ వైఖరి తగదు

### మూల్పూరి సాయి కళ్యాణి విమర్శ..



**గన్నవరం, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వారి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంలో వైస్సార్సీపీ నాయకత్వం స్పందించకపోవడం బాధాకరమని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఒక మహిళగా ఖండించాల్సిన వారు, శాంతియుత నిరసన తెలిపిన తెలుగుదేశం పార్టీ నాయకులపై కేసులు పెట్టాలని ఫిర్యాదు చేయడం సమంజసం కాదని ఆమె విమర్శించారు. గతంలో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అక్రమాలు, ప్రజా సమస్యలను ప్రస్తావించినందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఘటనలను ఆమె గుర్తుచేశారు. గన్నవరం నియోజకవర్గంలోని టీడీపీ కార్యాలయంపై దాడి చేసి ఆస్తులను ధ్వంసం చేసిన సందర్భంలో కూడా తాము సంయమనంతో వ్యవహరించామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు వచ్చినప్పటికీ తమ పార్టీ ఎక్కడా ప్రతీకార దాడులకు పాల్పడలేదని ఆమె స్పష్టం చేశారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ తదితర నాయకులు ఎల్లప్పుడూ చట్టబద్ధ మార్గంలోనే నిరసనలు తెలపాలని సూచించారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ద్వంద్వ వైఖరితో వ్యవహరించడం తగదని ఆమె హెచ్చరించారు. ముందుగా రాజకీయ నాయకులు, కార్యకర్తలు మహిళలను గౌరవించే సంస్కారం అలవరుచుకోవాలని సూచించారు. శాంతియుత ప్రజాస్వామ్య నిరసనలు కొనసాగిస్తామని, బెదిరింపులకు తాము భయపడబోమని మూల్పూరి సాయి కళ్యాణి స్పష్టం చేశారు.

## మేడూరులో 'ఈ-పంట', 'ఏపీఎఫ్ఆర్' నమోదును పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మేడూరు గ్రామంలో సాగులో ఉన్న పంటల నమోదు ప్రక్రియను మంగళవారం వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ-పంట, ఏపీఎఫ్ఆర్ నమోదు తీరును అధికారులు స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, గన్నవరం సహాయ సంచాలకులు సునీల్, మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి స్వయంగా ఏపీఎఫ్ఆర్ నమోదు చేసారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆమె స్వయంగా పొలాల్లోకి వెళ్లి, మొబైల్ యాప్ ద్వారా ఏపీఎఫ్ఆర్ నమోదును స్వయంగా చేపట్టారు. ఉన్నతాధికారులే నేరుగా క్షేత్రస్థాయిలో రైతుల వివరాలను నమోదు చేయడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా. ఈ సందర్భంగా మేడూరు గ్రామంలో సిబ్బంది నమోదు చేసిన వివరాలను అధికారులు స్వయంగా సరిచూశారు. పంట రకం, సాగు విస్తీర్ణం, రైతు వివరాలు యాప్‌లో కచ్చితంగా ఉన్నాయో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించటం ద్వారా నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి మాట్లాడుతూ ఎపిఎఫ్ఆర్, ఈ-పంట నమోదు పక్కాగా ఉంటేనే పీఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాల నగదు లబ్ధి నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేశారు. పంట నమోదులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా బాధ్యత తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, ఇతర అధికారులు సిబ్బందికి సూచించారు.

# పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సీఎంఆర్ఎఫ్ అందజేత

**పామర్రు మేజర్ న్యూస్ :** పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రులోని సచివాలయం -1లో గల పి -4 కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 90 మందికి మంజూరైన 45 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అయినా చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవని లాంటిదని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న అనంతరం తమ దృష్టికి విషయాన్ని తీసుకురాగా వెంటనే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్నట్లయితే వారి చికిత్సలకు అవసరం అయిన నిధులను ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందజేస్తామని, ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ



కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, నియోజకవర్గ పరిధిలోని మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పలువురు నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత లక్ష్యం మేరకు వచ్చే మార్చి నెల 15వ తేదీలోగా వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 108.44 కోట్ల రూపాయల మేరకు ఉపాధి హామీ పనులు చేపట్టవలసి ఉండగా ఇప్పటివరకు 47 కోట్ల రూపాయల మేరకు పురోగతి సాధించారన్నారు. అందులో 43 శాతం మేరకు బిల్లులను చెల్లింపు కోసం అప్లోడ్ చేశారన్నారు. మిగిలిన 61 కోట్ల రూపాయల పనులను ఎట్టి పరిస్థితుల్లోనైనా మార్చి 15వ తేదీ లోగా పూర్తి చేసి అందుకు సంబంధించిన బిల్లులను అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు మురిగిపోకుండా సకాలంలో సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లోడ్వామా పిడి కే శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, పలువురు ఏపీవోలు డిఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కోర్టు ఉద్యోగికి చేయుత



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం నియోజకవర్గం పోతేపల్లి గ్రామంలో జిల్లా కోర్టు ఉద్యోగి అర్జా లక్ష్మీ ఇల్లు ఆదివారం సాయంత్రం గ్యాస్ లీకేజ్ తో ఇల్లు మొత్తం కాలిపోయింది. సుమారు 7 లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. అర్జా లక్ష్మీ తన భర్త సుబ్బారావు ముగ్గురు చిన్నపిల్లలతో కాపురం ఉంటుంది. గ్యాస్ లీకేజీతో ఇల్లు మొత్తం కాలిపోయి కట్టుబట్టలతో ప్రాణాలతో బయట పడ్డారు. మంగళవారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువులు, బియ్యం బట్టలు, వంట సామాగ్రి, 5,000 రూపాయలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ గతంలో ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ పరంగా ఇచ్చే 5,000 రూపాయలు రద్దుచేసి కేవలం 25 కేజీలు బియ్యం ఇవ్వటం సమంజసం కాదని అన్నారు. నిజమైన అగ్ని బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా పక్కా ఇల్లు నిర్మించి లక్ష రూపాయలు బ్యాంకు రుణం మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. బాధిత కుటుంబానికి మచిలీపట్నంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని బాలాజీ కోరారు. రాబోయే వేసవికాలం పురస్కరించుకొని నగర ప్రజలు విద్యుత్తు షార్ట్ సర్క్యూటివ్ గ్యాస్ లీకేజీ పట్ల అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించుకోవాలని బాలాజీ అన్నారు. మచిలీపట్నం చుట్టుపక్క ప్రాంతాలలో అగ్ని ప్రమాద బాధితులకు గత 15 సంవత్సరాలుగా అండగా ఉంటున్న లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సేవలు ఆదర్శప్రాయమని మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పోతేపల్లి జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ తోట రాజేష్, మాజీ గ్రామ సర్పంచ్ శ్రీపతి చంద్రం, తమన్నఆదిత్య పోతేపల్లి సచివాలయం ఉద్యోగి ప్రభు ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్ బాధిత కుటుంబాలకు సంజీవని



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు సంజీవని లాంటిదని ఎంతో ఉపశమనం లభిస్తుందని, వారు త్వరగా కోలుకుందుకు ఈ రిలీఫ్ ఫండ్ ఉపయుక్తంగా ఉంటుందని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు గ్రామంలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో చిటికినేటి శివశంకరరావుకి రూ.23200ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు. ఆటో ప్రమాదంలో గాయపడి కాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్య ఖర్చుల భారం పేద ప్రజలపై పడకూడదనే లక్ష్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్ధవంతంగా అమలు చేస్తున్నారన్నారు. పి.రాము, బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, జొన్నల నాగమల్లేశ్వ రావు, బొమ్మిడి స్వామి, అల్లం పెద్ది రాజులు, పి .కొండ, ఈ.చంద్రరావు పాల్గొన్నారు.

## ఈనెల 19న ఏపీ ట్రెజరీలు, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘ ఎన్నికలు

**అమరావతి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** ఈనెల 19న ఆంధ్ర ప్రదేశ్ ట్రెజరీల, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘానికి ఎన్నికలు నిర్వహించినున్నట్లు ఎన్నికల అధికారి ఎం.జె. యేసుదాస్ (రిటైర్డ్ జిల్లా సహకార ఆడిట్ అధికారి) ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్‌లో మొత్తం 17 పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అధ్యక్షుడు (1), అసోసియేట్ అధ్యక్షుడు (1), ఉపాధ్యక్షులు (4), ప్రధాన కార్యదర్శి (1), ఆర్గనైజింగ్ కార్యదర్శి (1), కార్యదర్శులు (4), ఖజాంచి (1), కార్యవర్గ సభ్యులు (4) పదవులు భర్తీ చేయనున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాను 02-02-2026న విడుదలైనట్లుగా తెలిపారు. నామినేషన్ ఫారాల జారీ, స్వీకరణ 19-02-2026 ఉదయం 9.00 గంటల నుంచి 10.30 గంటల వరకు, అదే రోజు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఉదయం 11.45 గంటలకు చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రకటించనున్నారు. మధ్యాహ్నం 12.15 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటలకు తుది పోటీదారుల జాబితా విడుదల చేస్తారు. పోలింగ్ 19-02-2026 మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతుంది. ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల ప్రకటన అదే రోజు పోలింగ్ అనంతరం చేపడతారు. విజయవాడ గాంధీనగర్ లోని ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర కార్యాలయంలో జరుగుతాయని వివరించారు. అసోసియేషన్ సభ్యులు నిర్ణీత షెడ్యూల్‌ను పాటించి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు.

## మహారాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌తో చేతులు కలిపిన గోద్రేజ్ ఆగ్రోవెట్



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రముఖ వ్యవసాయ వ్యాపార సంస్థ గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రేజ్ ఆగ్రోవెట్), గ్రామీణ రైతులను శక్తివంతం చేయడానికి , స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి మహారాష్ట్ర రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌తో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఐక్యరాజ్యసమితి 2026ని అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించటానికి అనుగుణంగా ఈ భాగస్వామ్యం ఉంటుంది. ఇది వ్యవసాయ ఆహార వ్యవస్థలలో మహిళలు పోషించే కీలక పాత్రను హైలైట్చేస్తుంది. లింగ అంతరాలను తగ్గించడానికి, జీవనోపాధిని బలోపేతం చేయడానికి చర్యలకు పిలుపునిస్తుంది. ఈ మూడు సంవత్సరాల భాగస్వామ్యం స్వయం సహాయక బృందాలు, మహిళా రైతులను మంచి వ్యవసాయ పద్ధతులు, ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్ అవలంబించేలా సమీకరించడం, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం, స్థిరమైన జీవనోపాధిని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఒప్పందం ప్రకారం, గోద్రేజ్ ఆగ్రోవెట్ జీఏపీ, ఐపీఎం, భద్రతా పద్ధతులపై శిక్షణ వర్క్‌షాప్‌లను నిర్వహించడానికి ఎంఎస్ఆర్ఎల్ఎం-యుఎండీతో కలిసి పని చేస్తుంది. రైతు క్షేత్ర పాఠశాలలు, ప్రదర్శన ప్లాట్‌లను నిర్వహిస్తుంది. భద్రతా కిట్‌లను పంపిణీ చేస్తుంది. గోద్రేజ్ ఆగ్రోవెట్ ఈ కార్యక్రమానికి నిధులు సమకూర్చి అమలు చేయనుంది.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రజనీకుమారి పేర్కొన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రజనీకుమారి మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రత్యేక తరగతులు నిర్వహించి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మౌలిక వసతులు, పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం మెనూ, పాఠశాల కిటికీల మెస్ తలుపులు ఏర్పాటు పనులు, పలు రకాల జరుగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని జీసీడీవో విశ్వభారతికి సూచించారు.

# నగరాభివృద్ధిలో ముస్లింల పాత్ర మరువలేనిది






**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ మొహమ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం పంజా సెంటర్ వద్ద గల షా జహర్ ముసాఫిర్ ఖానాలో పేద ముస్లిం మహిళలకు రేషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ హాజరై ముస్లిం మహిళలకు రేషన్ కిట్స్ పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ ఫతావుల్లా పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 400 మంది ముస్లిం పేదలకు రూ.2,500 విలువ గల రేషన్ కిట్స్ పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సోసైటీ చేస్తున్న సేవలను కొనియాడారు. మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీకి తన పూర్తి సహకారం వుంటుందని, ఇటువంటి సోసైటీలు దేశ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. రంజాన్ మాసం బుధవారం నుంచి ప్రారంభం కానున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరలంతా రంజాన్ మాసంలో దేశ అభివృద్ధి కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రార్ధనలు చేయాలని ఆకాంక్షించారు. ఆటోమొబైల్ రంగంలో ముస్లిం సోదరుల పాత్ర ఎంతో వుందని, నగరాభివృద్ధిలో వారి పాత్ర మరువలేనిదన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం మైనార్టీలకు అండగా వుంటుందని స్పష్టం చేశారు. అలాగే ముస్లిం పేద మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించే విధంగా తోడ్పాటు అందించాలని మర్కజ్ ఇమామ్ ఇబ్నే బాజ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సోసైటీ నిర్వాహకులకు ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. గత ఏడాది కాలం నుంచి మహిళలకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేశినేని ఫౌండేషన్ ద్వారా ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సహాయ సహకారాలు అందిస్తానని సోసైటీ నిర్వాహకులకు తెలిపారు. ముస్లిం సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మర్కజ్ మజీద్ ఇమామ్ మౌలానా అబూ హోరేరా మదని, తెలుగు ప్రసంగికులు మౌలానా రబ్బాని, హనీఫ్ లతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా సెయింట్ ఫాల్స్ సెంటినరీ చర్చి 125వ వార్షిక పండుగలు



**విజయవాడ మేజర్ న్యూస్ :** కాళేశ్వర రావు మార్కెట్ సమీపంలో గల సియస్ఐ సెయింట్ ఫాల్స్ సెంటినరీ దేవాలయం 125వ ప్రతిష్ట వార్షికోత్సవ పండుగలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 15, 16,17 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగిన ఈ పండుగల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సియస్ఐ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ పండు జాకబ్ మాట్లాడుతూ 1900 సంవత్సరం ఫిబ్రవరి 6 వ తేదీన నాటి దైవ సేవకులు రెవరెండ్ జాన్ హారిసన్ చర్చి నిర్మాణానికి పునాది వేయగా 1901 ఫిబ్రవరి 17వ తేదీన మద్రాసు బిషప్ రైట్ రెవరెండ్ హెన్రీ వైట్ హెడ్ ద్వారా ప్రతిష్టించబడిందని తెలిపారు. నాటి నుంచి రెవరెండ్ హారిసన్ చర్చి పాస్టర్ గా సేవ చేస్తూ చుట్టుపక్కల గ్రామాల్లో అనేక సంఘాలను స్థాపించి క్రైస్తవ సమాజాన్ని పోషించి విస్తరించారని తెలిపారు. ఈ సంఘం వ్యవస్థాపక పితామహుడిగా ఆయన చేసిన శాశ్వత సహకారానికి గుర్తింపు గా 1911 ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన మొదటి ఫలశోభన కృతజ్ఞతారాధన సమయంలో ఒక స్మారక ఇత్తడి ఫలకాన్ని ప్రతిష్టించారని తెలిపారు. ఈ చర్చి లో పాస్టర్ గా సేవ చేసిన వారు అధ్యక్ష ఖండం బిషప్ లు గా ఉన్నత స్థాయి పదవులు అలంకరించారని తెలిపారు. అదేవిధంగా సంఘ సభ్యులు కూడా ఉన్నత స్థానాల్లో స్థిరపడే లా దేవుడు ఆశీర్వదించారని తెలిపారు. ఈ సంఘంలో జరిగే ఆరాధనలో క్రైస్తవులు తోపాటు ఇతర మతస్థులు కూడా పాల్గొని ప్రార్ధనలు చేయడం ఈ సంఘం యొక్క ప్రత్యేకత అన్నారు. ఈకార్యక్రమంలో చర్చి అసిస్టెంట్ పాస్టర్లు, ప్యారిష్ కమిటీ సభ్యులు, ఉమెన్స్ ఫెలోషిప్, యూత్ కమిటీ తదితరులు పాల్గొన్నారు.



## టాపర్లను సత్కరించిన ఎస్ వి ఎల్ కళాశాల

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గ్రూప్ వన్ గ్రూప్ టు పరీక్షలలో విజయం సాధించి ఉద్యోగాలు పొందిన భాను ప్రకాష్ సుధారాణి లను ఎస్ పి ఎల్ కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు సత్కరించారు. మంగళవారం స్థానిక ఎస్వీఎల్ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో గ్రూప్ వన్ పరీక్షల్లో టాపర్గా నిలిచి సేల్స్ ట్యాక్స్ డిపార్ట్మెంట్లో అసిస్టెంట్ కమిషనర్ గా ఉద్యోగం పొందిన నరహరిశెట్టి. భాను ప్రకాష్ ను ఎస్వీఎల్ కళాశాలలో చదివి గ్రూప్ టు పాసై సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్గా ఎంపికైన బండే. సుధారాణి లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాలలో నూరు శాతం హాజరు సాధించిన 24 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ 3 వేల చొప్పున రూ 70 వేల రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏజీపీ నరహరిశెట్టి. ఈశ్వరరావు , డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లు రాజేంద్రప్రసాద్, ఎన్వి నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పెన్షన్ టెన్షన్

### ఉన్న పింఛన్లకు ఊపిరి పోయే.. కొత్త పింఛన్లు కొండెక్కే : వైసీపీ అభిమాని గౌతమ్

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఉన్న పింఛన్లు కు ఊపిరి పోయి కొత్త పింఛన్లు కొండెక్కి వస్తాయో రావో తెలియని అయోమయ పరిస్థితిలో నిరుపేదలైన పింఛనుదారులు కొట్టుమిట్టాడుతున్నారని ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని వైసీపీ అభిమాని బడే గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలలోని వాలంటీర్ వ్యవస్థ ద్వారా రాజకీయాలకు కుల మతాలకు అతీతంగా వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అర్హులైన ప్రతి ఒక్కరికీ వారి ఇంటికి వెళ్లి మరీ పింఛన్ అందజేసి భారతదేశంలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ కార్యక్రమాన్ని రూపొందించి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఎన్నికల సమయంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల కన్నా మెరుగైన విధానం అమలు పరుస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం సహజంగానే అర్హులైన కొత్తవారికి పెన్షన్లు కేటాయించకపోగా ఏదో ఒక సాకు చూపి రాష్ట్రంలో మరీ ముఖ్యంగా మన అవనిగడ్డ నియోజకవర్గం లో వందలాదిమందికి పింఛన్లు రద్దు చేసి వారి పొట్ట కొట్టిందని వారి ఆవేదనను పట్టించుకునే నాధుడే లేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కూడా పింఛన్ల కేటాయింపుకు, మరియు ఇతర ఉచిత ప్రభుత్వ హామీలకు అవసరాలకు కావాల్సిన దానికన్నా మూలధనం తక్కువగా కేటాయించడం చూస్తుంటే చంద్రబాబు నాయుడు చెప్పిన సంపద సృష్టి అంటే ఇదేనేమో అనిపిస్తుందని, బడ్జెట్ కేటాయింపులు చూసిన నాటి నుండి పెన్షన్ దారులలో టెన్షన్ మొదలైందని గౌతమ్ తెలిపారు. ఇప్పటికైనా శాసనసభ్యులు బుద్ధ ప్రసాద్ నియోజకవర్గంలో గతంలో వలె అర్హులైన అందరికీ పెన్షన్లు అందజేసి అర్హులైన కొత్తవారికి పెన్షన్లు కేటాయింపు చేసే విధంగా చొరవ చూపాలని గౌతమ్ విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే కాల్ 1972




విజయవాడ, మేజర్ న్యూస్ : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషిచేద్దామని, ఎక్కడైనా డ్రగ్స్ ఆనవాళ్లు కనిపిస్తే 1972 ద్వారా సమాచారమివ్వాలని, ఈ నంబరుపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ సమన్వయం, నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సమావేశం జరిగింది. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీఎల్ఎస్ఏ సెక్రటరీ కె.రామకృష్ణయ్య తదితరులు హాజరైన సమావేశంలో జిల్లాలో నిర్వహిస్తున్న విస్తృత అవగాహన కార్యక్రమాలు, ఈగల్ ఆపరేషన్స్, డీ అడిక్షన్ కేంద్రం సేవలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, హాట్స్పాట్స్ తనిఖీలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై ఈగల్ ఆధ్వర్యంలో 133 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కళాశాలలు, ఉన్నతపాఠశాలలు, వివిధ ప్రాంతాల్లో వీటిని నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో గుర్తించిన 150 హాట్స్పాట్ ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. గతేడాది ఈగల్ ఆధ్వర్యంలో 27 కేసులకు సంబంధించి 71 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారికి డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్తో పాటు డిటాక్సిఫికేషన్ చేసిన అనంతరం సరికొత్త జీవితాన్ని ప్రారంభించేలా నైపుణ్య శిక్షణ వంటివాటిపై దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని కూడా తీసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల్లోనూ ఈగల్ క్లబ్స్ క్రియాశీలంగా పనిచేసేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**అందుబాటులో ప్రత్యేక వెబ్సైట్: సీపీ రాజశేఖరబాబు**

జిల్లాలో డ్రగ్స్పై దండయాత్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని.. 34 డే యాంటీ డ్రగ్స్ సైకిల్ ర్యాలీలు కూడా జరుగుతున్నాయని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. https://events.ntrpolice.in/ వెబ్సైటు కూడా అందుబాటులో ఉందని, ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకొని, ప్లెడ్జ్ తీసుకోవాలని సూచించారు. పిట్ ఎన్డీపీఎస్ చట్టాన్ని పటిష్టంగా అమలుచేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. కార్యక్రమంలో సే నో టు డ్రగ్స్, డ్రగ్స్ వద్దు.. స్కిల్స్ ముద్దు, ఈగల్ టోల్ఫ్రీ నంబరు 1972,ఈగల్ క్లబ్స్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, కేజీవీ సరిత, బి.లక్ష్మీనారాయణ, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, ఈగల్ అధికారులు ఎం.రవీంద్ర, డి.నాగార్జున, ఎం.వీరాంజనేయులు, సమన్వయ శాఖల అధికారులతో పాటు ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, నవజీవన్ బాల్ భవన్, ఆకర్ష ఫౌండేషన్, హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హాజరయ్యారు.

## డ్రగ్స్పై పోరులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం భేష్



విజయవాడ, మేజర్ న్యూస్ : డ్రగ్స్కు వ్యతిరేకంగా చేస్తున్న పోరులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ప్రశంసనీయమని.. ఆయా సంస్థల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం నగరంలోని సూర్యారావుపేటలో గల ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలోని సిమ్స్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు అలవాటుపడిన వారిని ఆ ఉచ్చు నుంచి బయటపడేలా చేసేందుకు ఈ కేంద్రం ద్వారా అందిస్తున్న చికిత్సా పద్ధతులు, కౌన్సెలింగ్ విధానాలను స్వయంగా పరిశీలించారు. శరీరంలో మాదకద్రవ్యాల అవశేషాలను గుర్తించేందుకు వీలుగా అందుబాటులో ఉన్న అధునాతన పరీక్షా పరికరాలను, కిట్లను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం ఈ కేంద్రానికి వస్తున్న వివిధ రకాల కేసులు, ఆయా వ్యక్తుల ప్రస్తుత పరిస్థితిని ఫౌండేషన్ ఛైర్మన్, సైకాలజిస్టు డా. జి.శంకరరావు వివరించారు. తీవ్రమైన వ్యసనంలో ఉన్నవారిని కూడా సరైన కౌన్సెలింగ్ ద్వారా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని.. దీన్ని తుదముట్టించేందుకు ప్రభుత్వ యంత్రాంగానికి అండగా నిలుస్తున్న స్వచ్ఛంద సంస్థలకు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు డా. టీవీస్ రావ్, నవితాశ్రీ పాల్గొన్నారు.

## 5వ జాతీయ స్థాయి వీల్ చైర్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడ మేజర్ న్యూస్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వీల్ చైర్ & డిసేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న 5వ జాతీయ స్థాయి వీల్ చైర్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎంపీ కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో మంగళవారం డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కమిటీ సభ్యులు యద్దపల్లి సూర్యనారాయణ తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ఈ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ నెల 23 నుంచి 28 వరకు విశాఖపట్నంలోని గుల్లేపల్లి స్పోర్ట్స్ అరేనా గ్రౌండ్స్లో నిర్వహించే 5వ జాతీయ స్థాయి వీల్ చైర్ క్రికెట్ టోర్నమెంట్ లో దేశంలోని పలు రాష్ట్రాల నుండి వీల్ చైర్ క్రికెట్ జట్లు పాల్గొంటారని ఎంపీ కేశినేని శివనాథ్ కు యద్దపల్లి సూర్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర దివ్యాంగుల క్రికెట్ సంఘం సభ్యులు మేక శ్రీనివాసరావు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 148 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరుగుతాయని, ఆయా శాఖలు సమన్వయం చేసుకుంటూ పరీక్షల నిర్వహణకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా పబ్లిక్ పరీక్షలకు 11,941 మంది బాలురు, 10,291 మంది బాలికలు కలిపి మొత్తం 22,232 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పకడ్బందీ పరీక్షల నిర్వహణ నిమిత్తం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్, కస్టోడియన్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది ఎవరికీ పరీక్ష హాల్లోకి సెల్ ఫోన్లు, ఇతర ఏ విధమైన ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని, దీనిపై వారందరికీ అవగాహన కల్పించాలని సూచిస్తూ, ఇది ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఎటువంటి జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరవకుండా మూసి ఉంచాలని, అదేవిధంగా ఆయా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి 144వ సెక్షన్ అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు ప్రతిరోజు ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా కేంద్రాలకు విద్యుత్ సరఫరా జరిగే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు వసతి కల్పించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆయా పరీక్షా కేంద్రాల రూట్లలో ఉదయం మధ్యాహ్నం సమయాలలో చాలినన్ని బస్సులను నడపాలని ఏపీఎస్ఆర్టీసీ అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈ పరీక్షలకు సమాంతరంగా ఓపెన్ స్కూల్ 10వ తరగతి, రెగ్యులర్ ఇంటర్మీడియట్ విద్యార్థులతో సమానంగా ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు కూడా జరుగుతాయని, మొత్తంగా 2,235 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖరరావు, ఏఎస్పి వివి నాయుడు, డీఈవో యు వి సుబ్బారావు, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, విద్యుత్, రవాణా, పోలీసు, తపాలా, విద్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

అవనిగడ్డ మేజర్ న్యూస్ : నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ అవగాహన ప్లేస్మెంట్ ట్రైనింగ్ పై నిర్వహించిన వర్క్ షాప్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీపై పట్టు సాధిస్తేనే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఏఐపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విచ్చేసిన మానేపల్లి మణికంఠ ఏఐ వినియోగం వినియోగం ఉద్యోగ ఇంటర్వ్యూలకు అవసరమైన ముందస్తు అర్హతలు నిర్మాణాత్మక సమస్య పరిష్కారాలపై అవగాహన కల్పించారు. దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు ఈ వర్క్ షాప్ లో టెక్ బీ సంస్థ తరపున స్కిల్ ఫిట్ పుస్తకాన్ని విద్యార్థులకు అందజేశారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి నాగార్జున కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ ఎన్ స్వర్ణ జ్యోతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా ఆదిత్య హోమం



అవనిగడ్డ మేజర్ న్యూస్ : మండల పరిధిలోని వేకనూరు గ్రామంలోని సూర్య దేవాలయంలో ఆదిత్య హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమావాస్య పుణ్య తిథిని పురస్కరించుకుని సూర్య దేవుడికి చందనంతో అలంకరించి పూజలు చేశారు. తొలుత సూర్యదేవునికి పంచామృత గో క్షీర అభిషేకాలు చేసి చందనము వివిధ రకాల పూల దండలు పట్టు వస్త్రాలతో అలంకరించారు ఆలయ ప్రాంగణంలో లోకకళ్యాణార్థం గ్రామంలో సుఖ శాంతులు విరాజిల్లాలని కోరుతూ ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు తుంగల వీర వసంతరావు ఇందిర దంపతులు ఆదిత్య హోమం నవగ్రహ హోమం మృత్యుంజయ హోమం క్రతువులను ఆగమ పండితులు సాయి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గట్టు కళ్యాణ్ పవన్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు అనంతరం వసంతరావు దంపతులు పూర్ణాహుతి చేశారు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న సంతర్పణ లో పాల్గొన్నారు.

## ఈనెల 19న రైజ్ ద్వారా జాబ్ మేళా..

### యువత సద్వినియోగం చేసుకోవాలి..

విజయవాడ, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ వికాస, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డి ఆర్ డి ఎ – సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ది.19.02.2026 గురువారం నాడు ఉదయం 09:00 గంటలకు మన విజయవాడ లోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడలో "జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సి. మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలియజేసారు. ఈ జాబ్ మేళా లో 10 కి పైగా కంపెనీల వారికి ఉన్నటువంటి ఉద్యోగాల ఖాళీలకు ఇంటర్వ్యూ జరుగుతాయని తెలియజేసారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు 10 వ తరగతి, ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బి.టెక్ పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువతి, యువకులు అర్హులని, ఎంపిక అయిన వారికి నెలకు రూ.12,000/- నుంచి రూ.40,000/- వరకు వేతనము, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, ఫిబ్రవరి 19న నిర్వహించబోయే ఈ జాబ్ మేళా కు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సి. మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలిపారు. ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration లింక్లో తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావడంతోపాటు, సదరు జాబ్ మేళాకు రెజ్యూమ్లతో లేదా బయో డేటా ఫాంలతో పాటు ఆధార్, ఆధార్కు లింక్ అయిన ఫోన్ నెంబర్, పాన్ కార్డ్ కాపీ, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 89774 71018, 81433 33218 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# యువత క్రీడాల్లో రాణించాలి



## అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక 45వ డివిజన్‌లోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో ముఖ్యమైనవని క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. చెస్ ఒక మేదస్సు ఆధారిత ఆట అన్నారు. ఇది మన ఆలోచన శక్తిని, సహనాన్ని నిర్ణయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. చెస్ పోటీలలో ప్రముఖ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్ ప్రపంచ ఖ్యాతి పొందారన్నారు. అలాంటివారిని స్ఫూర్తిగా తీసుకొని ముందంజలో నిలవాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని, యువత కోసం యువతరంగాలు, బీచ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు పెట్టి రవీంద్ర క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించారని టిడిపి సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. జిల్లా క్రీడా అధికారి కె. ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి చెస్ పోటీల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన చెస్ పోటీలలో 16 మంది యువత రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విజేతలుగా ఎంపికయ్యారని చెస్ పోటీలలో ఎంపికైన వారు ఈనెల 21, 22 తేదీలలో తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు వారిని పంపించడం జరుగుతుందన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ హసీం బేగ్, రాష్ట్ర శిష్ట కరణం సాధికార సమితి కన్వీనర్, అక్కుమంతి రాజా, తెలుగుదేశం పార్టీ నగర కార్పొరేషన్ అధ్యక్షుడు, లోగి శెట్టి వెంకటస్వామి, జిల్లా హాస్పిటల్ మాజీ డైరెక్టర్ అజీమ్, న్యాయవాది అమర్, చెస్ ఆర్గనైజేషన్ ఆర్బిట్రేటర్స్ లు పాల్గొన్నారు.

## త్వరలో అందుబాటులోకి రాణిగారితోట వాటర్ ట్యాంక్ నీరు..







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** రాణి గారి తోటలో గల నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ను త్వరగా పూర్తిచేసి, అందుబాటులో తీసుకొచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర. మంగళవారం తన పర్యటనలో భాగంగా రాణిగారితోట, కృష్ణలంక ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాణిగారితోటలో నిర్మిస్తున్న 1000 కి.లీ. సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి, డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు త్వరగా మంచినీటి సరఫరా ఆ ట్యాంకు ద్వారా అందుబాటులోకి రావాలని అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 పథకం కింద చేస్తున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించాలని అన్నారు. కృష్ణలంక నేషనల్ హైవే లో గ్రీన్ బెల్ట్ ను పెంచాలని ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణ అందించేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి రాణి గారి తోటలో గల అన్న క్యాంటీను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి, వాడుకనీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఏవైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో అన్ని రోడ్లను సిసి రోడ్లుగా మారుస్తాం





**పామర్రు మేజర్ న్యూస్ :** గ్రామాలలో ఉన్న అన్ని రోడ్లను సిసి రోడ్లుగా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని శాసనసభ్యులు కుమార్ రాజా పేర్కొన్నారు. మండల కేంద్రమైన పామర్రులో గ్రామపంచాయతీ నిధులతో నూతనంగా నిర్మించిన రెండు సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ సిసి రోడ్ల నిర్మాణాలను ప్రారంభించి కొన్ని రోడ్లను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మిగిలిన రోడ్లను కూడా సిసి రోడ్లుగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసినప్పుడే ఆయా ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని పేర్కొన్నారు. తొలుత ఆయన స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ మేనేజర్ వెంకటేశ్వరరావు శేష వస్త్రం, ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద పది లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డును, కళాశాల రోడ్‌లో 7.52లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు గ్రామ సర్పంచ్ కేతావత్తు కస్తూరి, తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, మాజీ ఎంపిపి గొట్టిపాటి లక్ష్మీ దాసు, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ ఉపాధ్యక్షులు మండపాక శంకర్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, పలువురు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## కోడూరు రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ సూచనలు



**కోడూరు మేజర్ న్యూస్ :** మండలంలో కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం పర్యటించారు మండల పరిధిలోని సాలెం పాలెం గ్రామంలో రీ సర్వే ప్రక్రియలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు రైతులతో నేరుగా మాట్లాడి రైతుల అభిప్రాయాలను సేకరించారు రెవెన్యూ సిబ్బందికి సూచనలు అందించారు పిట్టలలంక కరకట్ట వెంబడి ఆక్వా చిలకట్ట డ్రైనేజీకి తూములు వేసి పూడ్చుట కారణంగా 750 ఎకరాల సాగు భూమిలో పంట దెబ్బతింటుందని రైతులు కలెక్టర్ డీకే బాలాజీ కి తెలిపారు

## గన్నవరం విద్యార్థుల క్రీడా ప్రతిభకు పతకాల వర్షం




**గన్నవరం, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** విజయవాడ పడమట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హీల్ క్రీడలులో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఖో ఖో బాలుర విభాగంలో గన్నవరం జట్టు రజత పతకం కైవసం చేసుకుని ప్రతిభ చాటింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో శ్రీకర్, అకీమ్ వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో తేజేష్ పసిడి పతకం, తేజ రజత పతకం అందుకున్నారు. అదేవిధంగా తమ ప్రతిభతో సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన యస్.కె. అక్బర్ భాష, జి. నాగ బాలాజీ (ఖో ఖో), శ్రీకర్, అకీమ్ (బ్యాడ్మింటన్), తేజేష్, తేజ (అథ్లెటిక్స్), మల్లిఖార్జున్, సందీప్ (ఫుట్ బాల్), మోహన కుమార్, భార్గవి (అండర్ 12 రగ్బీ)లను గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఏ.సునీల అభినందించారు. పాఠశాల నుంచి ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న వ్యాయామ విద్య సహాయకులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో విద్యార్థులను ప్రోత్సహించాలని వ్యాయామ ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై పెడన పోలీసుల ప్రత్యేక అవగాహన



**పెడన, మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రతి వాహనదారుడు ప్రత్యేక శ్రద్ధ పై రోడ్లపై ప్రయాణం చేయాలని ప్రాణాలు ఎంతో విలువైనవి అని అదనపు ఎస్సై షేక్ బషీర్ అన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా వివరించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు కృష్ణాజిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలలో భాగంగా ప్రతి ఒక్క వాహనదారుడికి ప్రమాదాలు నివారణ అవగాహన కలిగేలా వివరించామన్నారు. ప్రాణాలు ఎంతో విలువైనవని తమ ప్రాణాల కింద అనేక కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలన్నారు. మచిలీపట్నంకత్తిపూడి 216 జాతీయ రహదారిపై పెడన తోటమూల సెంటర్ వద్ద ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గతంలో ప్రమాదానికి గురైన వాహనాన్ని రహదారి పక్కన ఏర్పాటు చేసి, ప్రమాదాల తీవ్రతను వాహనదారులు ప్రత్యక్షంగా గమనించేలా చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించడం వంటి ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999